# "ఎక్కడున్నా బావ...."

"థేంక్స బాబూ"

ఇల్లు చూపించిన కుర్రాడికి కృతజ్ఞతలు చెప్పి, నెమ్మదిగా గేటు తీసుకుని లోపలికి వెళ్లి, "మేష్టారూ...." అంటూ తలుపు తట్టాడు రాధాక్రిష్ణ.

"ఎవరదీ...." అని వినిపించింది, లోపల నుంచి.

రాధాక్రిష్ణ ఒళ్లు పులకరించింది. అప్పటికీ ఇప్పటికీ మేష్టారి స్వరంలో తేడాఏమీలేదు.

"ఎవరంటే....?" మళ్లీ లోపల్నుంచి ప్రశ్న.

"నేను మేష్టారూ...." అని, ఏంచెప్పాలో తోచక, "....తలుపు తియ్యండి" అన్నాడు రాధాక్రిష్ణ.

తలుపులు తెరుచుకున్నాయి.

నాలుగు కళ్లూ కలుసుకున్నాయి.

రెండు కళ్లల్లో భగవత్ సాక్షాత్కారమైన అనుభూతి, రెండు కళ్లల్లో ఎదుటి వ్యక్తిని గుర్తుపట్టలేని అయోమయం.

మేష్టారు అప్పుడే పూజనుంచి లేచినట్లున్నారు. భృకుటి వద్ద గుండ్రటి కుంకుమబొట్టు, నుదురు, ఛాతీ, కడుపు, జబ్బల మీద

విభూతి రేఖలు, మెడలో రుద్రాక్షమాల, చెవిలోపూలు, పట్టుపంచె, తలపై తడి ఆరని పొట్టి వెంట్రుకలు..., అమితమైన భక్తిగౌరవాలతో తదేకంగా చూస్తున్నాడు రాధాకృష్ణ.

కొద్దిక్షణాలు గడిచాక తేరుకుని, అడుగులోపలకు వేసి, పెట్టె క్రింద పెట్టి, ఆయన కాళ్లకు నమస్కరించాడు. "దీర్ఘాయుష్మాన్ భవ" అంటూ, అతని భుజాలు పట్టుకుని లేవనెత్తారు మేష్టారు. అతని ముఖంలోకే పరికించి చూస్తున్నారు. గురువుని గుర్తుంచుకునే అవకాశం శిష్యుడికి వున్నంతగా — ప్రతి శిష్యుణ్ణీ గుర్తుంచుకునే అవకాశం గురువుకి లేదు.

"నన్ను మీరు గుర్తుపట్టలేరు మేష్టారు! పద్దెనిమిది సంవత్సరాల క్రితం మీ ప్రియ శిష్యుణ్ణి. అప్పటి కాలేజీ ప్రిన్సిపాల్ శివరావు గారి అబ్బాయిని రాధాకృష్ణని...." నవ్వుతూ, సవినయంగా విన్నవించాడు రాధాకృష్ణ.

ముకుళించుకున్న మేష్టారి భృకుటి క్రమేపీ వికసించుతోంది. ఆయన ఆలోచన్లు పద్దెనిమిది సంవత్సరాలు వెనక్కి పరుగెత్తాయి. ఆయనకి గతం బాగా జ్ఞప్తి కొచ్చినట్లుంది; చిరుదరహాసం ఆయన పెదవులపై చిందులాడ నారంభించింది. రాధాకృష్ణ భుజాలు రెండూ పట్టుకున్నారాయన. ఆయన తనని గుర్తుపట్టుతున్నందుకు ఏదో అంతు తెలియని ఆనందం, ఒక రకమైన సిగ్గు కలుగుతున్నాయి అతనికి. ఆయన చేతి వేళ్లు అతని జబ్బలని అతి మెత్తగా చుట్టుకుంటున్నాయి.

"హరి భడవా! ఎంత పెద్దవాడివయ్యావోయ్. ఆఁ!" అన్నారు.

"అంతా మీ ఆశీర్వాదం మాష్టారూ" అన్నాడు రాధాకృష్ణ-తల వంచుకుని, ఉబ్బితబ్బిబ్బవుతూ.

"ఇదుగో - ఇలారా ఓసారి".... కుర్చీ చూపించి రాధాకృష్ణని కూర్చోమని సంజ్ఞచేస్తూ, లోపలివైపుకి వంగి పిలిచారాయన.

"వచ్చే...." అని గురుపత్నికంఠం వినిపించింది లోపల్నుంచి.

పద్దెనిమిది సంవత్సరాల్లో మేష్టారిలో భౌతికంగా చాలానే మార్పు వచ్చింది. తలవెంట్రుకలు బాగా వూడిపోయి, తెల్లబడిపోయాయి. ముఖం బాగా ముడతలుపడింది. కనుబొమలుసైతం తెల్లరంగు సంతరించు కున్నాయి. కళ్ళకిరింద నల్లచారలు పడ్డాయి. కాని, ఆ విశాలఫాల భాగంలో తేజస్సుమాత్రం అలాగేనిలిచివుంది కళ్లల్లో ఆదరణ, కరుణ, తీక్షత అలాగే నిలిచివున్నాయి.

చాలాకాలం తర్వాత కలిసిన గురుశిష్యులిద్దరూ ఎదుటివారిలో మార్పుల్ని కళ్ళతో చదువుతున్నారు. రెండునిమిషాలు గడిచాయి.

"ఏం చేస్తున్నావు లోపలా?" చిరుకోపం చిందులాడింది మేష్టారి పిలుపులో.

"ఇదుగో - వచ్చే...." శాంతియుతమైన గురుపత్ని జవాబు.

రాధాకిృష్ణ తలపైకెత్తి, చుట్టూచూశాడు. అది ఒక్కటేగది. వంటఇంటిని వేరు చేస్తూ ఒకతడక, దానికితగిలించి రెండు దేవుడి క్యాలెండర్లు గోడలకి అన్నీ పురాతనకాలపు దేవుడి పటాలే. ఒకదండెం మీద రెండుమూడు మాసికలుపడ్డ పంచెలూ, చీరలూ, ఒకటి రెండు పరికిణీలు, ఓణీలు, జాకెట్లూవున్నాయి. దానిపక్కగా ఒకమేకుకి ఒకమాసినలాల్చీ, ఖద్దరు వెస్టుకోటూ, ఖద్దరుటోపీ, ఓచేతికర్ర తగిలించి వున్నాయి. ఇంకోమూల రెండుగోడలనీకలుపుతూ చిన్న దండెం, దాని మీదఒకప్యాంటు, హ్యాంగరుకి తగిలించిన చొక్కావున్నాయి. వంట ఇంటి భాగంలో గోడవారగా ఆరేసిన ఒక తడిమడి చీర సగభాగం కనిపిస్తోంది.

తన ఆగమనాన్ని తెలియజేస్తూ గురుపత్ని ఖ్యాగా గొంతుసవ రించుకున్న ధ్వని చేశారు. రాధాకిృష్ణ లేచినిలబడ్డాడు. ఆమెలో కూడా

చాలానే మార్పుంది. మేష్టారికంటేకూడా వయోవృద్ధురాలిలా కనిపిస్తున్నారామె.

"ఆఁ.... ఇదిగో.... ఇతనూ.... వీడూ.... రాధాకిష్ణ అనీ చిన్నప్పుడు నా శిష్యుడు" అని భార్యకి పరిచయంచేశారు మేష్టారు.

"అలాగా...." అంటూ సాదరంగా చూశారు ఆమె రాధాకిష్ణవైపు

రాధాకిష్ణ ఆమెకి పాదాభివందనం చేసి, ఆమె ఆశీర్వాదం పొందాడు. మేష్టారి సంజ్ఞ స్వీకరించి, ఆమె లోపలకివెళ్లారు.

"చూడండి మేష్టారూ! మీ వంటి పూజ్య దంపతుల ఆశీర్వాదం పొందటమే ఓ మహద్భాగ్యం. నన్ను మీరు ఒక అతిథిగా భావించి, దయచేసి ఇప్పుడు కాఫీ అవీ అని శ్రమ తీసుకోవద్దు"

"ఇప్పుడసలు కాఫీ ఎవరు పెడ్తున్నారోయ్? అబ్బెబ్బే....ఏఁవీ లేదు" అంటూ మాట మార్చేసి, "ఊఁ! చెప్పు. ఎక్కడుంటున్నావు? ఏంచేస్తున్నావు? పెళ్ళి, పిల్లలూ....అన్నట్లు నాన్నగారు బావున్నారా? అమ్మగారు, పాపం ఇక్కడుండగానే...." అంటూడగానే ఆయన ముఖాన్ని విషాద ఛాయలు కమ్మేసాయి.

"నాన్నగారు కూడా గతసంవత్సరంలో పోయారండి"

"చ్చచ్చచ్చ! అలాగా, పాపం! మహదొడ్డ మనిషి. ఆయన చేతికి ఎముక లేదు" అంటూ బాధపడ్డారు.

"నాకు ఇప్పుడు ఇద్దరు పిల్లలండీ. ఒక ఆడ, ఒక మగ. అబ్బాయి ఐదు, అమ్మాయి మూడు చదువుతున్నారు"

"బావుందోయ్" అన్నారు మేష్టారు.

తను ఆ ఊరొచ్చిన కారణం చెప్పడం మంచి దనిపించింది రాధాకిష్ణకి. ఇంతలో గురుపత్ని రెండు ఇత్తడి గ్లాసుల్లో కాఫీతో

ప్రత్యక్షమయ్యారు. ఇక అనవసరంగా మొహమాట పడక కాఫీ అందుకున్నాడు రాధాక్రిష్ణ.

"నేను గత సంవత్సరమే రిటైరై పోయానోయ్. ఏవో కొన్ని ముఖ్యమైన ట్యూషన్లు చెప్పుతున్నాననుకో. అబ్బాయిని బి కాం. చదివించాను. పిల్లని కూడా బి.యె. చదివిస్తున్నాను. ఆడపిల్లయినా నేటి పరిస్థితుల్లో మరి చదువుండేనేగాని ఎవ్వరూ చూడట్లేదోయ్. నేను ఉద్యోగంలో వుండగా పిల్లాడు చేతికంది రాలేదు. ఆలస్యంగా పిల్లలు పుట్టడంతో ఇదుగో ఇలా కష్టాలు పడక తప్పదుమరి" అంటూ బాధపడ్డారాయన.

"ఇదిగో—ఓమారిలా వస్తారా?"

—భార్య పిలుపువిని, లోపలకి వెళ్లారు మేష్టారు.

లోపల జరుగుతూన్న గుసగుసలు తనకివ్వవలసిన ఆతిధ్యం గురించని సులభంగానే గ్రహించాడు రాధాక్రిష్ణ. మేష్టారి పరిస్థితి తెలిసుండీ కూడా తను ఎలా ఆతిధ్యం ఆశిస్తాడు?! పైగా మేష్టారింటికి రావడంలో తన వుద్దేశ్యం కూడా వారి సలహా, ఒక చిన్న సహాయం పొందడానికే— ఆతిధ్యానికి కాదు.

ఏదో స్వవిషయం మాట్లాడుకున్నట్లుగా నవ్వుతూ బయటకొచ్చారాయన. కానీ, ఆయనకు నటన రాదన్న సంగతి రాధాక్రిష్ణ గ్రహించాడు.

ఖాళీసంచీ వూపుకుంటూ, బయటనుంచి విసురుగా లోపలికి వచ్చిన పద్దెనిమిదేళ్ల అమ్మాయి— "ఇంక వాడు అరువివ్వడటమ్మా...." అంటూ ఏదో అనబోయి, రాధాక్రిష్ణని చూసి, నాలిక్కరుచుకుని, వంటింట్లోకి పరుగెత్తింది.

మేష్టారు గట్టిగా నవ్వేసారు.

"అమ్మడూ ! ఇలారా చిట్టితల్లీ !....రామ్మా. అన్నయ్యే-పరాయి వాడు కాదు" అన్నారు, ఇంకానవ్వుతూ.

ఆ అమ్మాయి నెమ్మదిగా బయటకొచ్చి, రాధాకిృష్ణకి నమస్కరించి, తలవంచుకు నిల్చుని, కాలి బొటన వేృలితో నేలమీద గీతలు గీయసాగింది.

"ఇది మా అమ్మాయిరా అబ్బాయ్! నువ్విక్కడున్నప్పటికి బహుశాపుట్టుండదు. దీనిపైనాడికే రెండు మూడేళ్ల కుర్రాడివా యెరుగుదువు నువ్వు. అవునా?" అని మేష్టారు అంటూండగానే లోపలికి జారుకుందా అమ్మాయి.

మేష్టారు తనని ఓసారి "రా" అని, ఓసారి "వోయ్" అని అనడం రాధాక్రిష్ణకి నవ్వుగావుంది. మరి తనకీ ముప్పై ఏళ్లొచ్చాయి.

"అబ్బాయి వాళ్ల మేనమామ వూరెళ్లాడు, సాయంత్రానికొస్తాడు. అన్నట్లు మా చెల్లాయి కుటుంబం నీకు తెలుసుకదా. ఈ దగ్గర్లోనే వుంటున్నారు వాళ్లు. పాపం, దాని బ్రతుకూ అన్యాయమ్మైపోవడంతో, మరి-నేనే యేదో నాకు చేతనయిన సాయం చేస్తూవచ్చాను. కాని ఇప్పుడు దానికేం లోటు లేదనుకో. కొడుకు చేతికి అందొచ్చాడు" అని మేష్టారు ఏదో ఆలోచనలో పడ్డారు.

ఒకనిముషం మౌనంగా గడిచి పోయింది.

"మరొస్తాను మేష్టారూ! ఈఊళ్లోదిగాక ముందు మీ దర్శనం చేసుకొని, ఆ తర్వాతే మిగిలిన పనులు చేసుకుందామని వచ్చాను. ఇప్పుడు ఈ వూరు చాలా మారిపోయింది. 'సిటీ'లా తయారయ్యింది. ఈ వూళ్లో ఏ హోటల్ బాగొంటుందో చెప్పండి మేష్టారూ!" అంటూ లేచాడు రాధాకిృష్ణ. మేష్టారిఇంటికివచ్చి, హోటల్లో దిగుతానని చెప్పడానికి అతని మనస్సుకి ఇబ్బందిగానే వున్నమాటనిజం. ఆయన మనస్సూ కష్టపడి వుంటుందని వూహించ గలడుకూడా. ఒకప్పుడు మేష్టారి ఇంటి

పరిస్థితి ఇంతకంటే చాలా మెరుగ్గావుండేది. స్కూలుకి దగ్గర్లోనే ఒక చక్కటిఇంట్లో వుండేవారు. కర్జాగానే బ్రతికేవారని చెప్పొచ్చు. పాపం, పిల్లల చదువులకీ, విధవ చెల్లెలు కుటుంబపోషణకి ఆయన ఆర్జన అంతా ఖర్చయి పోయి వుంటుంది. పైగా ఇప్పుడు రిటైరైపోయారు.

"ఏఁవిటీ అప్పుడే లేచావు? కాసేపలా కూర్చో. అసలేంపనిమీద వచ్చావ్? ఏఁవిటి సంగతులు? అంత రొందరేఁవుంది?" అన్నారు మేష్టారు—తమ ఆతిథ్యాన్ని స్వీకరించమని మాత్రం ఆహ్వానించ లేక పోయారు. దానికిఆయన కుటుంబ పరిస్థితులే పూర్తిగా కారణం. ఆయన హృదయం ఆక్షణంలో ఎంతగా విలవిల్లాడిందో ఆ భగవంతుడికి తెలుసు. రాధాకృష్ణకి తెలుసు.

తనువున్నవూరు, పనిచేస్తున్న ఆఫీసు, తను వచ్చిన పనీ చెప్పి మర్నాడు వెళ్లిపోతున్నానని చెప్పాడు రాధాకృష్ణ కొంచెం ఇబ్బందిగా కూర్చుని.

—అతను వచ్చిన పని వింటూనే మేష్టారికి మేఘాల్లో తేలిపోతు న్నట్లయ్యింది. రాధాకృష్ణ నిజంగా శ్రీకృష్ణపరమాత్మడిలా కనిపించాడు. దైవం తన ప్రార్థనలని ఇన్నాళ్లకు ఆలకించాడా అనిపించింది ఆయనకి. తన చిన్నగది ఒక పెద్ద భవంతిగానూ, తను పదిమందికీ ఆతిథ్యమివ్వ గల స్తోమతు గలవాడుగానూ అనిపించింది ఆయనకు.

"ఈ ఊళ్లో చాలామంది మిత్రుల్ని కలుసుకోవాలి మేష్టారూ! ఇంకా కొందరు ముఖ్యమైన వ్యక్తుల్ని కూడా కలుసు కోవలసివుంది. ఊరు బాగా మారిపోవడంతో నాకు బాగా కొత్తగావుంది. అందుకనే మీ ఆశీర్వాదంతో బాటు ఓ చిన్నసహాయం కూడా పొందుదామనే ముందు మీదగ్గరకొచ్చాను. మీరు ఏ ట్యూషన్ కుర్రవాడినైనా నాతో కొంచెం ఈ రోజుకి పంపించగలరేమో నని........" అంటూ నాన్చాడు రాధాకృష్ణ నెమ్మదిగా లేస్తూ.

చేతికి చిక్కిన అదృష్టం జారి పోతున్నట్లు అనిపించింది మేష్టారికి.

"కూర్చువోయ్! ముందు కూర్చో—పెట్టవు గాని. బట్టలు మార్చు కొని, స్నానానికి పద" ఆజ్ఞాపించినట్లుగా అన్నారు మేష్టారు,

ఆమాటలకి ఇద్దరూ కంగారు పడ్డారు. ఒకరు—రాధాకిృష్ణ. రెండు-గురుపత్ని,

"లేకపోతే.... హోటల్లో దిగుతావ్ట-హోటల్లో. ఎంత రిటైరై పోయి, ఇంట్లోకూర్చున్నా ఆ మాత్రం ఇంటి కొచ్చిన అతిధికి ఒక్క రోజు భోజన సదుపాయం చేయలేనంత అధమస్థితిలో లేనోయ్" అన్నారు మేష్టారు గట్టిగా. ఆ మాటల్లో రాధాక్రిష్ణని బలవంత పెట్టడం కంటే, తనని తాను ధైర్య పరుచుకోవడం యెక్కువగా కనిపిస్తోంది. ఆయన మాటలకి రాధాకిృష్ణ చాలా బాధపడ్డాడు.

"అదికాదు మేష్టారూ........"

"ఇంక నువ్వేం మాట్లాడొద్దు - అంతే" శాసించారాయన.

తను ముందు ఏ హోటల్లోనయినా దిగిపోయి, తర్వాత మేష్టారింటికి రావాల్సిందేమో అనిపిస్తోంది రాధాక్రిష్ణకి. పద్దెనిమిది సంవత్సరాల తర్వాత కూడా మేష్టారింతలా ఆపేక్ష చూపించడం ఆశ్చర్యకరంగా వుంది. రాధాక్రిష్ణకి....అందులో ఇటువంటి పరిస్థితుల్లో... !!!

"వేసవికాలం. చన్నీళ్ళేగా? దొడ్లో బావివుంది. చూపిస్తాపద, త్వరగా తయారవ్వు కాలకృత్యాలు తీర్చేసుకుంటే నీకావలసిన చోటు కల్లా వెళ్లొచ్చుమనం. ఈరోజు వేరేవం పనిలేదునాకు" అంటూ తొందర పెట్టారు మేష్టారు.

"నాతో మీరొస్తారా?! మీరెందుకు మేష్టారూ? ఎవరైనా కుర్రాడ్ని...."

"మరేం ఫర్వాలేదోయ్. ఆ సంగతి తర్వాత చూద్దాంగానీ ముందు నువ్వు నడు"

ఇబ్బంది గానే బట్టలు మార్చుకుని, పెరట్లోకి వెళ్లాడు రాధాక్రిష్ణ

శిష్యుణ్ణి పెరట్లోకి పంపించి, వంటింట్లోకి వెళ్లారు మేష్టారు శిలాప్రతిమలా నిల్చుని వున్నారు ఆయన భార్య.

"ఇదుగో వర్ధనం. మరేం కంగారుపడకు, నేనేపన్చేసినా మన కుటుంబ శ్రేయస్సుకే. అతనికూ్కడా బియ్యంపడెయ్యి."

"అదిసరేనండీ. బియ్యంపడేస్తేసరా?! కూరా, పులుసూ ఏఁవీఁ లేకుండా ఏంభోజనం పెడదామండీ?!!" తెరిచిన నోరు ముయ్యకుండా ఆయన కళ్లలోకి చూస్తూ అడిగారామె.

ఆయన చిన్నగా ధ్వని చేస్తూనవ్వేరు.

"నేనంతా అప్పుడే అలోచించానోయ్! అమ్మడూ, నువ్వెళ్లి, ఆ శ్యామలరావు గారిని నేను ఓ పదిరూపాయలిమ్మన్నానని చెప్పి తీసుకో. ఈనెల వాళ్లబ్బాయి ట్యూషన్ ఫీజు క్రింద జమ కట్టుకోవచ్చు. దాంతో ఇంట్లోకి కావాలసినవి తీసుకురా. రాత్రికూ్కడా రాధాక్రిష్ణ ఇక్కడే భోంచేస్తాడు" అని, విషయం చెప్పకుండా ఒక రకమైన ఆనందతో, భార్యవైపు ఆమెకు ధైర్యమిస్తూ సంజ్ఞచేసి, గర్వంగా ఓచూపువిసిరారు. ఆపైన - బయటకు వెళ్లేందుకు బట్టలు మార్చుకున్నారు.

స్నానం ముగించిన రాధాక్రిష్ణ బట్టలు మార్చుకొని, తలదువ్వు కున్నాడు. అతనికి మాత్రం చాలా ఇబ్బందిగా వుంది.

"వెళ్దామోయ్? దగ్గర్లో వున్నవాళ్లని కలుసుకుని, ఓ గంటలో ఇంటికి వచ్చేస్తే, ఆతర్వాత సాయంత్రం దాకా ఎన్నిపనైనా చూసుకోవచ్చు. ఏవంటావ్?" భుజంమీద కండువా వేసుకుంటూ అన్నారు.

"అదిసరేకాని మేష్టారూ! భోజనం....ఉఁ....ఎలాగూబయటకు

వెళుతున్నాం కాబట్టి ఏ హోటల్లో అయినా చేసేద్దాం. పాపం, అమ్మగార్ని శ్రమ పెట్టకండి" - ప్రాధేయపడ్డాడు రాధాకృష్ణ.

"అలాగే అలాగేలే. పద...." అంటూ, మాట దాటించేసారు మేష్టారు. ఆయనలో ఒకరకమైన ఠీవి, ఆనందంవున్నాయి. వద్దంటువ్నా ఆతిధ్య మివ్వడం ఆయనలో ఆత్మగౌరవాన్ని పదింతలు చేస్తోంది.

ఓ గంటసేపు తిరిగి వచ్చిన గురుశిష్యులు సుష్టుగా భోజనం చేసి, కిళ్లీలు వేసుకొని, మళ్లీ బయల్దేరారు.

'మేష్టారు నాకోసం బాగా శ్రమ తీసుకుంటున్నారు. పైగా ఈ పరిస్థితుల్లో నా వల్ల అదనపు ఖర్చు ఇంట్లో. రేపు వెళ్లేటప్పుడు పిల్లల చేతుల్లో ఏఁవన్నా పెట్టేస్తేసరి' అనుకున్నాడు రాధాకృష్ణ.

కలవవలసిన వారినందరినీ కలుసుకుని, పనులన్నీ అయి, ఇంటికి చేరేసరికి రాత్రి ఏడయ్యింది.

అప్పటికి మేష్టారు ఏదో చెబుదామనుకున్నారు గానీ-" మా అబ్బాయి" అని మాత్రం చెప్పి వూరుకున్నారు. ఆ రోజులో ఆయన రాధాకృష్ణకి ఏదో చెబుదామనుకుని మానుకోవడం అది మూడవసారి. బహుశా సమయం చూసి చెబుదామనుకుని వూరుకొని వుంటారు.

నలుగురికీ భోజన ఏర్పాట్లు జరిగాయి. గురుపత్ని వడ్డనకి వుండి పోయారు. కన్నతల్లిని మరిపించే గురుపత్ని ఆదరాభిమానాపేక్షలతో వడ్డించిన పదార్థాలు 'అమృతం ఇంతకంటే రుచిగా వుంటుందా' అని పిస్తూండగా, మేష్టారి బలవంతమీద మళ్లీమళ్లీ వడ్డించమని తినిపిస్తూండగా, వారి అబ్బాయితో ఆ ఊరులో వచ్చిన మార్పుల గురించి మాట్లాడుతూ, వారి అమ్మాయి ఛలోక్తులకు కడుపుబ్బ నవ్వుతూ, సంతృప్తిగా భోజనం ముగించాడు రాధాకృష్ణ.

మేష్టారికీ, శిష్యుడికీ డాబామీదపక్కలు ఏర్పాటుచేశారు. బాగా విశాలమైన డాబా. ఇంటివాళ్ళు వేసవికాలమైనా, శీతాకాలమైనా ఫ్యాను

పెట్టుకుని ఇంట్లోనే పడుకుంటార్ట. తమలపాకులునములుతూ, రుశిష్యు లిద్దరూ డాబాపైకిచేరారు.

ఆకాశంచూపిస్తున్న గుండ్రటి దీపపుపసిమి వన్నె వెలుతుర్లో పుడమివెలిగిపోతోంది. పాలమీగడ తరకల్లాంటి తెల్లటి మేఘ శకలాలు అతినెమ్మదిగా కదులుతున్నాయి. ఆకాశం తారలచీర కట్టుకుంది. డాబా మీదకు పాకిన సన్నజాజితీగలు సువాసనలతో మత్తెక్కిస్తున్నాయి. డాబా కంటే ఎత్తుగా ఎదిగిన మామిడి, రామాఫలపు చెట్లు ఆగిఆగి వూగి చల్లటి గాలితో మేనికి పులకలిడుతున్నాయి కొద్దిసేపటికిత్రితం డాబామీద నీళ్లు జల్లినట్లున్నారు. పగలంతా ఎండిన ఆ ప్రదేశంలోంచి ఓ గమ్మత్తు సువాసన వస్తోంది.

జంక్షనులోంచి రిక్షారంగయ్య శ్రీరామకీర్తనలు గొంతెత్తి శ్రవణా నందంగా, హృదయాలు ఆనందలహరిలో డోలలూగేలాగ ఆలపిస్తు న్నాడు. వాడు ఈవాళ మళ్లీ తాగాడన్నమాట. వాడు వారానికి ఓసారే తాగుతాడు. ఆరోజు ఆపేటలో ఆసమయంలో ఎవ్వరూ రేడియోలు పెట్టుకోరు. వాడిపాటలు విని, తన్మయత్వం చెందుతారు. ఎలా లేదన్నా ఓ గంట శ్రోతలను మైమరపిస్తాడు వాడు. మత్తుదిగిందంటే వాడినోట వచ్చేవి బూతులే. అదే వాడిమత్తులోని గమ్మత్తు.

ఇంట్లోవున్న ఒక్క పరుపునీ రాజాకిష్టకివేసారు. మేష్టారుబొంత వేసుకున్నారు. బనీనుకూడాతీసేసి, తాటాకు విసినకర్రతో విసురుకుంటూ, లోకాభి రామాయణంలోకి దిగారు. పాపం, ఆరోజు పగలంతా ఆయన ఎండ దెబ్బతిన్నారు బాగా అలసిపోయారు.

మేష్టారి అమ్మాయి పళ్లెంలో నాలుగు బొంత అరటిపళ్లుతెచ్చి వారిద్దరి మధ్యపెట్టి మరచెంబుతో మంచినీళ్లు, రెండుగ్లాసులు పిట్టగోడ వారగా అమర్చి, క్రిందకు వెళ్లిపోయింది.

అరటిపళ్లుతిని, మంచినీళ్లు తాగి, వెల్లకిలాపడుకొని, వెన్నెల్ని

ఆస్వాదిస్తూ, ఇద్దరూ అప్పటివరకూ తమకుటుంబాల్లో వచ్చిన మార్పుల గురించి మాట్లాడుకున్నారు. తను ఆవూరు వచ్చిన పనికి సంబంధించి కొన్ని విషయాలు చెప్పాడు రాధాకిృష్ణ. మేష్టారు ఏదో చెబుదామనుకుని మళ్లీఆగారు. ఒక్కొక్కసారి తను ఎటువంటి క్లిష్టపరిస్థితుల్ని ఎదుర్కోవలసివస్తుందో చెప్పనారంభించాడు రాధాకిృష్ణ.

తనుచెబుదామనుకున్నది ఎలాచెప్పాలో మేష్టారికి తెలియడంలేదు. తెల్లవారేక ఎలాగూ రాధాకిృష్ణకి తెలుస్తుంది, కాని తానుగా ఒక్కమాట చూచాయగానైనా అతని చెవిన వెయ్యడం చిన్న మర్యాద.

"అంతెందుకు మేష్టారూ! రేపు నేనిక్కడకు ఆ వుద్యోగాలకు సంబంధించి 'ఛీప్ ఇంటర్వ్యూయర్'గా వస్తున్నానని తెలిసి, ఎలా లేదన్నా కనీసం పది మందైనా నా దగ్గర కొచ్చారు. ఉన్నవి మూడు పోస్టులు."

-మేష్టారు విసినకర్రికిృందపెట్టారు, నెమ్మదిగా లేచికూర్చుని, శృద్ధగా ఆలకించసాగారు.

"కొందరు కేండిడేట్సుని కూడా తీసుకు వచ్చారు. వాళ్లవాళ్ల కష్టాలు చెప్పుకున్నారు. నిజంగానే నాకు జాలేసింది."

ఉక్కపోయి, మేష్టారికి లోపల్లోపల కొంచెంగా చలి వేస్తోంది.

"అందులో ఇద్దరు ఆడవాళ్లు కూడా వున్నారు. వాళ్ల అబ్బాయిలకు ఈ ఉద్యోగం రాకపోతే వాళ్ల కుటుంబ పరిస్థితి అర్ధాన్నమయిపోతుందని మొరపెట్టుకున్నారు. ఒకావిడ ఏడ్చేసింది కూడా."

మేష్టారికి చలి ఎక్కువైంది. బయట ఉక్కడా తన్నుకొచ్చింది. గుండెలు వణికి చస్తున్నాయి. నెమ్మదిగా దుప్పటి భుజాల మీదకు లాక్కున్నారు.

"ఒకాయన వాళ్ల అమ్మాయిని తీసుకువచ్చాడు. ఆ అమ్మాయి తండ్రి ఎదురుగానే పెళ్లయిన వాణ్ణి నాదగ్గర వగలుబోయింది. అస

హ్యం వేసి, బయటకు పంపించేసాను. ఇంకో ఆయనయితే పెద్ద ఫోజుగా వచ్చి, 'ఎన్నివేలు తీసుకుంటార'ని అడిగాడు. తన్నినంత పనిచేసి, బయటకు పంపించేశాను."

మేష్టారికి కొంచెం ఒణుకు కూడా మొదలయ్యింది. దుప్పటి తల మీదుగా కప్పుకున్నారు.

"ఇక నాతో బాటే వస్తూన్న మిగతా ఇద్దరు ఆఫీసర్లూ సరేసరి. ముగ్గురూ మూడు పోస్టులూ పంచుకుందామన్నారు. వాళ్లిద్దరూ అప్పుడే ఇద్దరికి మాటిచ్చేశారుట కూడా. నేను ససేమిరా ఒప్పుకోనన్నాను. న్యాయంగా 'ఇంటర్వ్యూ'లో ఎవరి 'పెర్ఫార్మెన్స్' బాగుంటే వాళ్లవే సెలెక్టు చెయ్యాలన్నాను. మూడు పోస్టులూ 'మెరిటోరియస్' కేండిడేట్సుకే దక్కాలన్నాను. వాళ్లవలన నాకు జరిగే పనుల్నీ, వాళ్లతో నాకున్న పరిచయాన్నీ గుర్తుచేసారు వాళ్లు. 'ఎక్కడన్నా బావ గానీ వంగతోట దగ్గర కాదు' అని ఖచ్చితంగా చెప్పేశాను. అందులో ఒకడు ఇక్కడి ఎమ్మెల్యే క్యాండిడేటు అని చెప్పారు వాళ్లు. ఎమ్మెల్యే కాదు-యముడే దిగొచ్చినా నేను అలాంటి పాడుపని చెయ్యనని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేశాను. అదంతా మీరు నేర్పిన విద్యే కదా మేష్టారు" అంటూ, అప్పటి వరకూ వెల్లకిలా పడుకుని చెప్పుకు పోతూన్న రాధా క్రిష్ణ - మేష్టారి వైపుతిరిగి, బొంత కూడా వంటి నిండా తలమీదుగా కప్పుకుని వణికిపోతూన్న మేష్టార్ని చూసి, కంగారుపడి, లేచి కూర్చున్నాడు.

"అదేవిఁటి మేష్టారూ-అలా వణికి పోతూన్నారేవిఁటి?" అన్నాడు కంగారుగా.

"ఏం లేదు నాయనా! వయసయి పోయింది కదా! పైగా ఈ చలిజ్వరమొహటి. ఎప్పుడొస్తుందో తెలియదు. క్షణాలమీద కమ్మే

స్తుంది. నేను క్రిందకు వెళ్ళి, అబ్బాయిని పంపిస్తాను, నీకు తోడుగా" అంటూ, నెమ్మదిగా లేచి, మెట్లవైపు బయల్దేరారాయన.

"అరె, పాపం!" అన్నట్లుగా చూస్తూ కూర్చుండి పోయాడు రాధాక్రిష్ణ.

"ఇంకానయం — అడిగే సాను కాదు! ఇహ వాడి ఖర్మ యెలా వుంటే అలా జరుగుతుంది. ఘటన వుండాలి గానీ, అంత దాకా మనం ఎంత శ్రమపడ్డా వృధాయే. దైవ కటాక్షం కలిగిన నాడు ఎవ్వరూ అడ్డలేరు. రాధాక్రిష్ణ చెప్పిందీ నిజమే. ఏ మొహమాటాలకీ, డబ్బుకీ, మరే ఆశకీ లొంగి, తప్పుడు పన్లు చెయ్యొద్దని నేను బోధించినదేగా అతని చిన్నప్పుడు. ఇలాంటి విషయాల్లో ఏ మాత్రం లొంగి ఒకరికి మేలు చేసినా, అనేక మందికి అన్యాయం చేసినట్లవుతుంది. మరే ఎక్కడన్నా బావ కాని...." మెట్లు దిగుతూ, మర్నాడు ఇంటర్వ్యూ కోసం పుస్తకాలు తిరిగేస్తున్న కొడుకుని తలచుకుంటూ, సణుక్కున్నారు మేష్టారు.

స్వాతి అక్టోబరు 1977